కాఫీ పండ్ల ధర పెంపు

ప్రజాశక్తి-చింతపల్లి : కాఫీ రైతులకు ఊరటనిచ్చేలా కాఫీ పండ్ల ధరలను పెంచుతూ సంబంధిత అధికారి, సంఘ ప్రతినిధులు నిర్ణయం తీసుకున్నారు. పాడేరు ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ, ఎపిఒ వెంకటేశ్వర్లు, కాఫీ ఎడి బొంజుబాబు సమక్షంలో కాఫీ యూనియన్ అధ్యక్షులు జనకని సింహాచలం, ఉపాధ్యక్షులు మర్రి వెంకట్రావు, కోశాధికారి మామిడి గోవింద్‌రావు, మ్యాక్స్ సభ్యులు సమావేశమై ధరలను ఖరారు చేశారు. దీని ప్రకారం ఏ గ్రేడ్ కాఫీ పండ్లకు కిలోకు రూ.60, బీ గ్రేడ్ కాఫీ పండ్లకు రూ.55 చెల్లించనున్నారు. మార్కెటింగ్ పూర్తయిన తర్వాత బోనస్ రేటు నిర్ణయించి, రైతుల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని కొనసాగించనున్నారు. గత సీజన్‌లో కాఫీ పండ్ల ధర కిలోకు రూ.44గా నిర్ణయించగా, రైతులకు మొదటి బోనస్‌గా రూ.8, రెండో బోనస్‌గా రూ.8 చెల్లించి మొత్తం రూ.60 రైతుల ఖాతాల్లో జమ చేసిన విషయం తెలిసిందే. కొత్త రేట్లతో ఈ సీజన్‌లో రైతులకు మరింత లాభం చేకూరే అవకాశముందని అధికారులు తెలిపారు.

ఏళ్ల తరబడి నిర్వహణలో నిర్లక్ష్యం..

రూపు కోల్పోయిన కోనాపురం రోడ్డు

- రహదారిలో మచ్చుకైనా కానరాని తారు
- మొంథా దెబ్బకు మెటల్ రోడ్డు కన్నా అధ్వానం
- రాకపోకలకు గిరిజనం అవస్థలు
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని అధికారులు

రాళ్లు తేలి, బాటలుగా ఏర్పడ్డ కోనాపురం తారురోడ్డు

ప్రజాశక్తి-కాశీపట్నం: ఏళ్ల తరబడి నిర్వహణ, మరమ్మతులు లేకపోవడం, భారీ వర్షాలు ఉధృతికి కోతకు గురై కొట్టుకుపోవడంతో మండలంలోని మారుమూల కోనాపురం పంచాయితీ తారురోడ్డు అధ్వానంగా తయారైంది. నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగించే ఈ రహదారి పూర్తిగా రూపుకోల్పోయినాఈ రోడ్డు దుస్థితిని అటు అధికారులుగానీ, ఇటు ప్రభుత్వం గానీ పట్టించుకోవడం లేదని మహిళా సంఘ మండల అధ్యక్షురాలు కాసులమ్మ స్వాభి, ఇతర మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల మొంథా తుఫాన్ దెబ్బకు రాళ్లుతేలిపోయి, తారు ఆనవాళ్లు లేనంతగా పూర్తిగా పాడైపోయిందని, ఇప్పటికైనా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి, తక్షణ మరమ్మతులతోపాటు శాశ్వతప్రాతిపదికన పునర్నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

అనంతగిరి మండలంలో కోనాపురం పంచాయతీ కేంద్రం నుంచి బొర్రా గేటువలస జంక్షన్ వరకు ఏడు కిలోమీటర్లు తారురోడ్డు రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఈ తారు రోడ్డు నిర్మించి 22ఏళ్లు గడిచిందని, ఈ మార్గలో నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తున్నా నిర్వహణలో పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలునానరు. రహదారి నిర్మించిన నాటినుంచి నేటి వరకు ఏనాడూ చిన్నపాటి మరమ్మతులైనా చేసిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏటవాలుగా ఉండే ఈ రహదారి వర్షాలకు క్రమేణా కోతకు గురౌతూ రోడ్డు వెంబడి బాటలు మారిందని, తారు మొత్తం మాయమై మెటల్‌రోడ్డు కన్నా అధ్వానంగా తయారై, గిరిజనుల రాకపోకలకు తీవ్ర ఇక్కట్లుకు గురిచేస్తున్నా పట్టించుకోవడం లేదని గిరిజన మహిళ సంఘం మండల అధ్యక్షురాలు కాసులమ్మ మండిపడుతున్నారు. అత్యవసరం, నిత్యావసరాలకు ఇదే మార్గం కావడంతో ఇప్పటికైనా విమర్శిస్తున్నారు. తక్షణమే రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.ఏ ప్రభుత్వం వచ్చిన ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించాలని, అధ్వానంగా ఉన్న రోడ్డుకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నవజాత శిశు మరణాలపై ఆరా

బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ

ప్రజాశక్తి ముంచింగిపుట్టు : మండలంలోని దారెల పంచాయతీ కుమ్మరిపుట్టు, తలింబ, దారెల గ్రామాలలో పిల్లల వరుస మరణాలపై అల్లూరి జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి సిహెచ్ ఝాన్సీభాయి స్పందించారు. సోమవారం ఆయా గ్రామాలను సందర్శించి, బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. చిన్నారుల మరణాలకు కారణాలపై ఆరా తీశారు. ఆశాలు ఆరోగ్యశాఖ అధికారుల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. నవజాత శిశువుల మరణాలకు కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సిహెచ్‌సి, పిహెచ్‌సిల్లోని వైద్యులు చిత్తశుద్ధి తో వైద్య సేవలు అందించాలన్నారు. అవగాహన లేని ఆదివాసీ గిరిజన గర్భిణులు, బాలింతలకు.ఆసుపత్రుల్లో కాన్పులు, వైద్య చికిత్సలపై వైద్యులు, సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఆశాలు, అంగన్వాడి కార్యకర్తలు గర్భిణుల ఆరోగ్యంతోపాటు గ్రామాలలో విషజ్వరాలు, ఆరోగ్య సమస్యలు గుర్తించిన వెంటనే వైద్య సిబ్బందికి, సూపర్‌వైజర్లకు తెలియజేయాలన్నారు అంగన్వాడీ కేంద్రాలలో క్రమబద్ధంగా ప్రీస్కూల్ జరగాలని, పిల్లలందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని ఆదేశించారు. పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్. చంద్రమౌళి, సెక్టారు సూపర్‌వైజర్ సిహెచ్ వరహాలమ్మ, బ్లాక్ కోఆర్డినేటర్ వ్ణి.సురేష్, ఎంఎల్‌హెచ్‌పి తులసి,పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ట్రాక్టర్ డ్రైవింగ్

హెల్మెట్ పెట్టుకున్న ట్రాక్టర్ డ్రైవర్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధారణ తప్పనిసరి అని ట్రాఫిక్ నిబంధనలు నిర్దేశించినా, పోలీసులు, రవాణా శాఖ అధికారులు దీనిపై ప్రత్యేకంగా అవగాహన, తనిఖీలు చేస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడోగానీ హెల్మెట్ కనిపించని పరిస్థితుల్లో.డుంబ్రిగుడ మండల కేంద్రంలో ఒక ట్రాక్టర్ డ్రైవర్ హెల్మెట్ పెట్టుకుని ట్రాక్టర్ నడిపి అందరినీ ఆశ్చర్యచకితులను చేశాడు. హెల్మెట్ ధరించాలని బైకిస్టులను వెంటపడి చెబుతున్నా పట్టించుకోని పరిస్థితుల్లో, ఒక ట్రాక్టర్ డ్రైవర్ ఇలా చేయడాన్ని పలువురు అభినందిస్తున్నారు. వాహనమేదైనా ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ధరిస్తే రక్షణ ఉంటుందని కొందరు అంటుండగా, దీన్ని చూసైనా ద్విచక్ర వాహనదారులకు జ్ఞానోదయం కలిగి, ఇకనుంచైనా హెల్మెట్‌ధారణకు ప్రేరణగా నిలుస్తుందని కొందరు సూచిస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ ఏ ఉద్దేశ్యంతో హెల్మెట్ ధరించినా, డుంబ్రిగుడలో ఇది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ప్రాధాన్యతాక్రమంలో భూపరిహారం : కలెక్టర్

ప్రజాశక్తి- పాడేరు : డి గొందూరు, కింతలి పాడేరు బైపాస్ జాతీయ రహదారికి కేటాయించిన భూములను అటవీ, ఉద్యానవన శాఖ, రెవెన్యూ శాఖ కలిసి క్షేత్రస్థాయిలో ఉమ్మడి తనిఖీ చేసి అవార్డు ధర నిర్ణయించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుండి రెవెన్యూ, జాతీయ రహదారి అధారిటీ అధికారులతో జాతీయ రహదారి నిర్మాణం, పరిహారం చెల్లింపులుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో పరిహారం చెల్లింపులలో లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా భూ నిర్వాసితులకు అందజేయాలని ఆదేశించారు. ప్రాధాన్యతాపరంగా చెల్లింపులు చేయాలని స్పష్టం చేసారు. గత సమావేశంలో పెండింగ్‌లో ఉన్న పనులు పై ఆరా తీశారు. రెవెన్యూ భూములతో అటవీ పట్టాలు కలిగిన గిరిజనులకు ప్రత్యామ్నాయం భూములు ఇస్తామన్నారు. భూములు రద్దు ప్రక్రియ పద్ధతి ప్రకారం జరగాలని ఆదేశించారు. పబ్లిక్ నోటీసు ఇచ్చిన తర్వాత త్రీజీ అవార్డ్ తనిఖీపై తహశీల్దార్లు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సివిల్ డిపాజిట్ కేసెస్ ఎన్ని ఉన్నాయి, ఎన్ని అప్పగించారు, దానిపై పక్కా నివేదిక తదుపరి సమావేశంలో అందజేయాలని అధికారులు ఆదేశించారు. సమావేశంలో పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీపూజ, ఆర్‌డిఒ ఎంవిఎస్ లోకేశ్వరరావు, జాతీయ రహదారి అధికారులు గుల్షన్ కుమార్, రవి శేఖర్, తాహశీల్దారులు పాల్గన్నారు..

విధులకు ఉపాధ్యాయుల డుమ్మా!

- సిపిఎం సర్పంచ్, ఇతర బృందం సందర్శనలో బట్టబయలు
- గైర్హాజరైన ఎంటిఎస్ టీచర్లపై తక్షణ చర్యలకు డిమాండ్

పాఠశాల సందర్శనలో సిపిఎం సర్పంచ్, తదితరులు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : మండలంలోని అత్యంత మారుమూల లక్ష్మీపురం పంచాయతీ అర్లోయిపుట్టు, దాబుగూడ, లక్ష్మీపురం గ్రామాలలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఎంటిఎస్ ఉపాధ్యాయులు విధులకు డుమ్మాకొట్టిన వైనం బట్టబయలైంది. సోమవారం లక్ష్మీపురం పంచాయతీ సిపిఎం సర్పంచ్ కొర్రా త్రినాథ్, ఉప సర్పంచ్ అర్లాబు సత్యం పాఠశాలల సందర్శనలో మూడు చోట్లా ఎంటిఎస్ ఉపాధ్యాయులు విధులకు గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు హాజరుకాని ఉపాధ్యాయులను తక్షణమే సస్పెండ్ చేసి, వారి జీతాలను రికవరీ చేసే విధంగా కఠినచర్యలు తీసుకోవాలని సర్పంచ్ డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా మూడు పాఠశాలల ఎస్ఎంసి చైర్మన్లు మాట్లాడుతూ ఆదివాసి గిరిజన ప్రాంతంలో నూరుశాతం విద్యాబోధన సంకల్పంతో గత ప్రభుత్వం 1998 డిఎస్‌సి బ్యాచ్ అర్హులకు ఎంటిఎస్ ఉపాధ్యాయులుగా నియమించి ఉద్యోగ అవకాశం కల్పించింది. మారుమూల గ్రామాలలో ఉద్యోగరీత్యా విధుల్లో చేరిన వీరు విధులకు హాజరుకాకపోవడం శోచనీయమని, గిరిజన విద్యకు శాపంగా వ్యవహరిస్తున్న వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు

అర్లోయిపుట్టు పాఠశాలలో 47 మంది విద్యార్థులకు ఒక రెగ్యులర్ ఉపాధ్యాయుడు, భాషా వాలంటీర్ సక్రమంగా విధుల్లో ఉంటే, ఎంటిఎస్ ఉపాధ్యాయుడు జాయినైనమూడు రోజులు మాత్రమే వచ్చి తర్వాత పత్తా లేకుండా పోయారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇక దాబుగూడలో 27 మంది విద్యార్థులకు ఒక భాషా వాలంటీర్ మాత్రమే ఉన్నారు. రెగ్యులర్ టీచర్‌భర్తీతర్వాత ఆ స్థానాన్ని భర్తీ చేయకపోవడం, ఇక్కడ విధుల్లో చేరిన ఎంటిఎస్ ఉపాధ్యాయులు మూడురోజులే వచ్చి తర్వా కనిపించక పోవడంతో ఇక్కడ పాఠశాల నిర్వహణ దుర్భరంగా మారింది. లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో 42 మంది విద్యార్థులకు ఒక రెగ్యులర్ ఉపాధ్యాయుడు ఉన్నారు. ఎంటిఎస్ టీచర్ రికార్డుల్లోనే తప్ప, ఇక్కడా విధులకు రావడం లేదు.

దీనిపై లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ మూడుపాఠశాలల్లో 116 మంది విద్యార్థులుండగా, మూడు చోట్లా ఎంటిఎస్ ఉపాధ్యాయులు విధులకు రాకపోవడం దుర్మార్గమన్నారు. విద్యాశాఖాధికారుల పర్యవేక్షణా లోపం వల్లే గిరిబాలల భవిష్యత్ బలౌతోందని మండిపడ్డారు. ఎంటిఎస్ ఉపాధ్యాయుల గైర్హాజరుపై ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు, అదనపు భవన నిర్మాణాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు.అధికారులు ఇప్పటికైనా స్పందించి పరిస్థితులను చక్కదిద్దకపోతే, ఈనెల 22న అరకు సందర్శనకు వచ్చే విద్యాశాఖమంత్రి లోకేష్, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. వార్డు సభ్యులు పి.త్రినాథ్, గ్రామస్థులు బి.సీతారాం, పి.గోవింద్, బి. రమేష్, సుఖదేవ్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణపై ఐక్య పోరాటాలు

- సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా మహాసభ పిలుపు
- ఐదు అంశాలపై తీర్మానాలు
- జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వాణిశ్రీ, వెంకట్

జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ

మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి-రంపచోడవరం : కార్మికులకు నష్టం చేకూర్చే ప్రైవేటీకరణ విధానాలపై ఐక్య పోరాటాలకు సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ద్వితీయ మహాసభ పిలుపునిచ్చింది. రెండు రోజులపాటు రంపచోడవరంలోని పూనెం సత్యనారాయణనగర్‌లో తలపెట్టిన జిల్లా మహాసభ ఆద్యంతం ఉత్సాహంగా సాగి, సోమవారంతో ముగిసింది. తొలి రోజు నిర్వహించిన భారీ ర్యాలీ, బహిరంగ సభ చైతన్యపూరితంగా సాగిన విషయం తెలిసిందే. రెండో రోజు సంఘం ప్రతినిధుల సభ ఉత్తేజంగా నడిచింది. తొలుత సంఘం పతాకాన్ని జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ ఆవిష్కరించారు. అనంతరం మహాసభ అధ్యక్షవర్గం, మినిట్స్, తీర్మానాల కమిటీలను ఎన్నుకున్నారు. పి.రామరాజు, ఎం.వాణిశ్రీ, బి.నిర్మల అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సంతాప తీర్మానాన్ని పి.రామరాజు ప్రవేశపెట్టారు, అమరవీరులకు మహాసభ ఘనంగా నివాళ్లర్పించింది.

ప్రతినిధుల సభను ఉద్దేశించి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు మరింత సంఘటితంగా ఉద్యమిస్తేనే ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టగలమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను, ఉద్యోగులను చిన్నచూపు చూస్తున్నాయన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటికీ నెరవేరలేదన్నారు. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. సూపర్ సిక్స్‌లో తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం మినహా మరేవీ అమలు కాలేదన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు రూ.మూడు వేల నిరుద్యోగభృతి, 18 సంవత్సరాలు నిండిన మహిళలందరికీ నెలకు రూ.1500 వంటి హామీలన్నీ మాటలకే పరిమితమయ్యాయన్నారు. సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలంటే రూ.నాలుగు వేల కోట్లు అవసరమవ్వగా కేవలం రూ.895 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. మెగా డిఎస్‌సి పేరిట నిరుద్యోగ గిరిజన యువతను ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, ఇంటి పన్నుపై సమీక్షిస్తామని, చదువుల కోసం వడ్డీ లేని రుణాలు, డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణం, బిసిలకు 50 ఏళ్లకే పెన్షన్, ఏజెన్సీ ప్రాంతంలో జిఒ నెంబర్ 3 అమలు వంటివన్నీ గాలిలో కలిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ, ఆశా, మిడ్డే మీల్స్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బొప్పెన కిరణ్ మాట్లాడుతూ కార్మిక లోకం ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన కార్యదర్శి నివేదికను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

తీర్మానాలివీ..

కార్మికులకు కనీసం వేతనం 26 వేలు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మహాసభలో తీర్మానాలు చేశారు. సభ్యులందరూ ఆమోదించారు.

35 మందితో జిల్లా కమిటీ ఎన్నిక

సంఘం నూతన జిల్లా కమిటీ 35 మందితో ఎన్నికైంది. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.వాణిశ్రీ, పల్లపు వెంకట్, కోశాధికారిగా పాయం సీతారామయ్య, సహాయ కార్యదర్శులుగా పుట్టా రామరాజు, ముసురు రాజేశ్వరి, ఈతపల్లి సత్యనారాయణరెడ్డి, కొర్రపు రాణి, గొర్రె రాజు, ఉపాధ్యక్షులుగా కంభం శాంతిరాజు, బత్తిన నిర్మల, పోడియం లక్ష్మణ్, చింత రాంబాబు, తాటితూర శ్రీనివాస్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, అధ్యక్షురాలు ఎం.వాణిశ్రీ, కోశాధికారి పాయం సీతారామయ్య

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సిపిఎం పోరాటాలతో గుండాలకు రోడ్లు

ప్రజాశక్తి - ఎటపాక: గుండాల పంచాయతీకి రోడ్ల నిర్మాణం సిపిఎం పోరాట ఫలితమే అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఐ వి అన్నారు. సోమవారం సచివాలయ అధికారులు స్థానిక రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఐవి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా, గుండాల పంచాయతీలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను నిర్మించాలని సిపిఎం నిరంతరం పోరాటం చేస్తోందని 2023లో మూడు రోజుల పాటు సచివాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు, రాస్తారోకో చేసి అధికారులకు వినతి పత్రాలు ఇచ్చామని ఈ ఏడాది కూడా మే 29వ తేదీ నుంచి జూన్ 4 వరకూ రిలే నిరాహార దీక్షలు, రాస్తారోకో చేసి అధికారులకు వినతిపత్రాలు అందించామని, ముఖ్యమంత్రి కార్యాలయానికి మెయిల్ ద్వారా సమాచారం పంపించామన్నారు. ఎట్టకేలకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతోందని, ఇదేకాకుండా మిగిలిన రోడ్లు కూడా నిర్మాణం సాగించాలని లేని పక్షంలో మరోసారి పోరాటం చేస్తామని ఐ.వి. హెచ్చరించారు.

అవగాహన కల్పిస్తున్న పిహెచ్‌సి సిబ్బంది

పౌష్టికాహార లోపంతోనే అకాల శిశు జననాలు

ప్రజాశక్తి- విఆర్‌పురం: పౌష్టికాహార లోపం వల్లనే అకాల శిశు జననాలు జరుగుతున్నాయని రేఖపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ నిరంజన్‌కుమార్ తెలిపారు. మండలంలో రేఖపల్లి పిహెచ్‌సి జీడిగుప్ప ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ అకాల శిశుజనన దినోత్సవం నిర్వహించారు. మొద్దులగూడెం, రాజుపేట సబ్ సెంటర్లలో ప్రజలకు అవగాహన శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నిరంజన్ కుమార్ మాట్లాడుతూ గర్భం దాల్చిన నాటి నుండే తగు జాగ్రత్తలతో సరైన పౌష్టికాహారం తీసుకుంటూ రక్తహీనత లేకుండా ఆరోగ్య కేంద్రం పర్యవేక్షణలో తల్లి బిడ్డ ఆరోగ్యాన్ని సురక్షితం చేసుకోవాలని సూచించారు. నెలలు నిండకుండా పుట్టిన బిడ్డకు వెంటనే ఇంక్యుబేషన్ సంరక్షణ, సరైన వెచ్చదనం అందించడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో పిహెచ్ సి సిబ్బందితో పాటు సూపర్‌వైజర్ పున్నమ్మ, సిహెచ్‌ఒ ఉషారాణి, ఎఎన్ఎంలు వెంకటలక్ష్మి, స్థానిక ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధారకొండ మండల కేంద్రం ఏర్పాటుకు కృషి

గంగులయ్యకు వినతిపత్రం అందజేస్తున్న మండల సాధన కమిటీ నాయకులు

ప్రజాశక్తి -సీలేరు: ధారకొండ మండల కేంద్రం ఏర్పాటు కృషి చేస్తామని జనసేన పార్టీ అరుకు పార్లమెంటు ఇన్‌చార్జి, జానపద సాంస్కృతిక కళల చైర్మన్ వంపురి గంగులయ్య హామీ ఇచ్చారని మండల సాధన కమిటీ నాయకులు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర విష్ణుమూర్తి తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జనసేన పార్టీ అరకు పార్లమెంటరీ ఇన్చార్జి గంగులయ్య తమ ఆహ్వానం మేరకు సోమవారం ధారకొండ వచ్చి సాధన కమిటీ నాయకులతో సమావేశం అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా మండల ఏర్పాటుకు గల ఆవశ్యకతను ఆయనతో సాధన కమిటీ నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం వినతిపత్రం అందించామని ఆయన సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో జనసేన అరకు పార్లమెంటు మెంబర్ గొర్ల వీర వెంకట్, సీలేరు ఇన్‌చార్జి క్రియ వాలంటీర్ జె. బాలకృష్ణ, జీకే వీధఙ మండలాధ్యక్షుడు కొయ్యము బాలరాజు మండల సాధన కమిటీ నాయకులు సొన్ను సిపిఐ మాజీ ఎంపిటిసి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గంగులయ్య కు ఘన స్వాగతం

జీకే వీధి : మండలంలో పాడేరు జనసేన పార్టీ ఇన్‌చార్జి ఆంధ్రప్రదేశ్ జానపద నృత్య సజనత్మక అకాడమీ చైర్మన్ గంగులయ్య మండల పర్యటనలో భాగంగా జనసేన పార్టీ అధ్యక్షులు కొయ్యం బాలరాజు ఆధ్వర్యంలో రింతాడ, దుచ్చరిపాలెం, ఏబులం, చాపగెడ్డ కుమ్మరివీధి, గొడిచింత, కాకరపాడు, కొరపల్లి, మర్రిపాలెం, పనసలొద్ది గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో సమస్యలు వివరించారు. రోడ్లు, డ్రైనేజిలు, త్రాగున్నీరు సమస్యలు పరిష్కరించవలసిందిగా కోరారు.పెదవలస సర్పంచ్ కృష్ణవంశీ , రాజు, తదితరులు పాల్గొన్నారు.

జన్‌మన్ ఇళ్లకు బిల్లులు వెంటనే చెల్లించాలి

- ఐటిడిఎ పిఒకు వినతి

ప్రజాశక్తి - రంపచోడవరం: జన్మన్ పథకం ద్వారా మంజూరు చేసిన ఇళ్లకు బిల్లులు వెంటనే చెల్లించాలని 'ఆదివాసీ గిరిజన సంఘం భీమవరం గ్రామకమిటి ఆధ్వర్యంలో సోమవారం ఐటిడిఎ పిఒకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు కత్తుల గంగిరెడ్డి, బట్ట మల్లిరెడ్డి మాట్లాడుతూ భీమవరం, ఇవ్వంపల్లిలో జన్‌మన్ పథకం కింద ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఇంటి బిల్లులు పూర్తిగా ఇవ్వడం లేదని ఈ విషయమై అధికారులకు ఇప్పటికే తెలిపామన్నారు. తక్షణమే బిల్లులు చెల్లించాలని కోరారు.

పిఒకు వినతిపత్రం ఇస్తున్న గ్రామ కమిటీ నాయకులు

వేంగడలో సంతకాల సేకరణలో ఎమ్మెల్యే, ఇతర నేతలు

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కాశీపట్నం: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మండలంలోని వేంగడలో మండల పార్టీ అధ్యక్షుడు కొర్రా సూర్యనారాయణ ఆధ్వర్యంలో రచ్చబండ నిర్వహించి కోటి సంతకాల సేకరణ చేపట్టారు. నిర్వహించారు. కార్యక్రమంలో అరకులోయ ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ, రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం 17 ప్రభుత్వ వైద్యకళాశాలలను మంజూరు చేస్తే, వాటిల్లో పదింటిని పిపిపి విధానంలో ప్రయివేటుకు కట్టబెట్టాలని కూటమి ప్రభుత్వం చూడడం దుర్మార్గమన్నారు.వైసిపి రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు రేగం చాణుక్య మాట్లాడుతూ, మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలన్నారు. కోటిసంతకాల సేకరణ చేపట్టి, గవర్నర్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు పాగి అప్పారావు, వాలసీ సర్పంచ్ సేంబి సన్యాసిరావు, మాజీ జెడ్పిటిసి దూరు గంగన్నదొర, అధ్యక్షుడు వేంగడ సర్పంచ్ బుట్టన్న, డుంబ్రిగూడ మండల అధ్యక్షుడు పరుశురాం, గుజ్జెల మధుసూదన్, సొసైటీ మాజీ ప్రెసిడెంట్, వేంగడ మాజీ ఎంపీటీసీ గంగన్న, కె లక్ష్మణ్, సిహెచ్ రామ్మూర్తి, పి శ్రీరాములు, కె ప్రసాద్, ఎస్ సంతోష్, ఎం సంతోష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పాస్టర్స్, యుసివైఎం ప్రతినిధులు

మెగా క్రిస్మస్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- పాడేరు టౌన్: యునైటెడ్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా క్రిస్టమస్-2025 వేడుక వచ్చేనెల 13న పాడేరులో ఉంటుందని అసోసియేషన్ చీఫ్ రీమలి జాన్ తెలిపారు. సోమవారం పాడేరులో జిల్లా, పాడేరు పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులతో కలసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో క్రైస్తవులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఎం.బాబూరావు, టి. లక్ష్మణరావు, ఎస్.సాల్మన్, ఎం.డానియల్, సిహెచ్.జీవన్, యోబు, తిమోతి, సుధాకర్, యుసివైఎ ప్రతినిధులు కె.సుజిత్ మత్స్యలింగం, ఎం.స్టీవెన్ శ్రీనివాస్, డి.రవికుమార్, జ్ఞానప్రకాశ్ పాల్గొన్నారు.

ప్రీమెచ్యూర్ జననాలపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి -పాడేరు: ప్రపంచ వ్యాప్తంగా శిశు మరణాలకు ప్రీటెర్మ్ జననాలు ప్రధాన కారణమని, ప్రీమెచ్యూర్ శిశువుల ఆరోగ్య సమస్యలు, సమయానికి చికిత్స ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన పెంచడం అత్యవసరమనిజిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్. సిహెచ్ కమలకుమారి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి కృష్ణమూర్తి నాయక్ ఆధ్వర్యంలో ప్రపంచ అకాల జనన దినోత్సవం 2025 సందర్భంగా పాడేరు ప్రభుత్వాసుపత్రిలో బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా నిర్వహించిన ర్యాలీని ప్రారంభించిన డిఐఒ డాక్టర్ కమలకుమారి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పిహెచ్‌సిల పరిధిలో ప్రీమెచ్యూర్ శిశువుల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలన్నారు. అకాల శిశువుల జీవన శాతం పెంచడానికి సమయానికి చికిత్స, సమర్థమైన నియోనేటల్, హైరిస్క్ గర్భిణుల స్క్రీనింగ్ వంటి సేవలను బలోపేతం చేయాలని సూచించారు.కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ పి. సింహాచలం, డిపిహెచ్ఎన్ఒభూలోకమ్మ, ప్రభుత్వాసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్, వైద్య సిబ్బంది పాల్గున్నారు.

జనవరిలోగా పెండింగ్ పనుల పూర్తి

ఇంజినీరింగ్ అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : జిల్లాలో చేపడుతున్న రోడ్డు నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ అభివృద్ధి కార్యక్రమాలపై రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్‌రాజ్, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న రహదారులకు త్వరితగతిన గుంతలు పూడ్చాలన్నారు. జిల్లాలో జాతీయ రహదారుల విస్తరణకు సంబంధిత శాఖల అనుమతులు వేగంగా లభించేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. నూతనంగా నిర్మించే రహదారులకు ప్రతిపాదనలు తయారు చేయలన్నారు. సకాలంలో పూర్తయిన పనులకు నిధులు మంజూరు చేయాలన్నారు. పర్యాటక ప్రదేశాలను రోడ్లతో అనుసంధానం చేసి పర్యాటకాభివృద్ధికి సహకరించాలన్నారు. నిర్మాణాలను నాణ్యతలో చేపట్టాలని సూచించారు.
జిల్లాలో మూడు ఐటిడిఏ పరిధిలో పలు గ్రామాలలో జరుగుతున్న బిటి రోడ్ల, కాజ్‌వే, రిటైనింగ్ వాల్ , గ్రామ పంచాయతీ, అంగన్వాడీ , బహుళ ప్రయోజక భవనాల నిర్మాణాల పనుల పురోగతిని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పరిశీలించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకంలో భాగంగా గ్రామ పంచాయతీలలో చేపడుతున్న గ్రామ పంచాయితీ భవన నిర్మాణాల పనులు వేగవంతం చేయాలన్నారు. పిఎం జన్‌మన్ పథకం ద్వారా చేపడుతున్న అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పంచాయితీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు . శిధిలమైన భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారుచేయలన్నారు.కార్యక్రమంలో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, తిరుమణి శ్రీపూజ , రంపచోడవరం, చింతూరు ఐటిడిఏ పిఒలు స్మరణ్ రాజ్, శుభం నొఖ్వాల్, ఆర్అండ్‌బి ఇఇ బాల సుందరబాబు, సిపిఒ పి. ప్రసాద్ , పలు శాఖల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు .

15వ ఆర్థిక సంఘం నిధులను...

గ్రామపంచాయతీల ఖాతాలో వేయాలి

సర్పంచ్‌లు పాంగి సునీత, మొస్య

పాంగి సునీత

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: కేంద్ర ప్రభుత్వం రెండు విడతలుగా విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ959 కోట్లను వెంటనే గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమచేయాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గసబ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి సునీత డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నెల రోజుల క్రితం అన్ టైడ్ కింద రూ410 కోట్లను, అలాగే టైట్ గ్రాంట్ కింద రూ 548 కోట్లు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల కోసం కేంద్రం విడుదల చేసిందన్నారు,ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేయించి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలు నిధులు ఇతర పథకాలకు మళ్లించడంతో గ్రామాల అభివృద్ధిని పక్కన పెడితే కనీసం తాగునీరు, పారిశుధ్యంవంటి ప్రజా సమస్యలను పరిష్కరించ లేకపోయామని, చిరకు కరోనా సమయంలో వీధుల్లో బ్లీచింగ్ చల్లేందుకు కూడా నిధులులేక ఇబ్బందులు పడే పరిస్థితి ఉండేదన్నారు
కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత రాష్ట్రంలోని పరిస్థితులు గతం కన్నా కొంత మెరుగ్గా ఉన్నా, మునుపటి నిధుల విడుదలలోజాప్యం చేసిందన్నారు. పార్టీలకతీతంగా సర్పంచ్‌లందరూ ఆందోళన చేయడంతో నిధులు విడుదల చేశారన్నారు. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి చొరవ చూపి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను వెంటనే గ్రామ పంచాయతీల ఖాతాలో జమ చేయాలని కోరారు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలలో సర్పంచ్‌ల గౌరవ వేతనం, గ్రామ పంచాయతీలకు బడ్జెట్‌లో నిధులు పెంపుదల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కిల్లో మొస్య

అనంతగిరి : గ్రామపంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని టోకురు సిపిఎం సర్పంచ్ కిల్లో. మొస్య డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీల్లో కనీస నిధులు లేకపోవడంతో బ్లీచింగ్, క్లోరినేషన్, నీటి పథకాల మరమ్మతులు వంటి పనులకు సర్పంచులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్థికసంఘం నిధులను పంచాయతీ ఖాతాలకు జమ చేయాలన్నారు. సిపిఎం సర్పంచ్ సోమ్మెల. రూతు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి డుంబ్రిగుడ: జాతీయ గ్రంథాలయ వారోత్సలను పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు కమలాకర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ గ్రంథాలయాలను వచ్చి వాటి సేవలను వినియోగించుకోవాలన్నారు. ఇంటర్ తరువాత ఉన్నత చదువులు, ఉద్యోగాలకు అవసరమైన కొన్ని పోటీపరీక్షల పుస్తకాలు శాఖగ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాట్లాడుతున్న దొన్నుదొర

పెట్టుబడుల హబ్‌గా ఆంధ్ర

ఎపిఎస్ఆర్‌టిసి జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తీసుకున్న నిర్ణయాత్మక విధానాలతోనే రాష్ట్రంలోకి భారీగా పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని, టిడిపి అరకు ఇంచార్జ్, ఎపిఎస్ఆర్‌టిసి విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర అన్నారు .ఈనెల 14, 15వ తేదీల్లో విశాఖలో పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు ద్వారా పరిశ్రమల స్థాపనకు రూ.13లక్షల కోట్లకు పైబడి పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయన్నారు. సోమవారం అరకులోయలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, సదస్సులో 613 ఒప్పందాలు జరిగాయని, .ఈ పరిశ్రమలు స్థాపన జరిగితే 16,13,188 మంది ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. చంద్రబాబు, లోకేష్ నాయకత్వంలో అభివృద్ధి ట్రాక్‌పైకి మళ్లీ ఆంధ్రప్రదేశ్ వచ్చిందన్నారు. పెట్టుబడుల హబ్‌గా ఆంధ్రప్రదేశ్‌ను మార్చేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు .ప్రాంతానికో ప్రధాన పరిశ్రమను తీసుకొచ్చి అభివృద్ధి చేయాలన్న చంద్రబాబు సంకల్పం సాకారమౌతుందన్నారు.కార్యక్రమంలో పెట్టెలి రాము, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-చింతపల్లి : డ్రగ్స్ వల్ల అనర్థాలపై మండలంలోని జాజుపాలెం ప్రభుత్వ గిరిజన సమక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈగల్ టీమ్ ఆధ్వర్యాన నిర్వహించిన జనజాగరణ కార్యక్రమంలో ఈగల్ ఆర్ఎస్ఐ శ్రీరామ్మూర్తి, హెడ్ కానిస్టేబుల్ ఎలిషా విద్యార్థులకు మాదకద్రవ్యాల ముప్పు గురించి వివరించారు. యువత డ్రగ్స్ బారిన పడటానికి కారణాలు, డ్రగ్స్ అలవాటుతో కలిగే మానసిక, శారీరక నష్టాలు, అలవాటు నుండి దూరంగా ఉండటానికి అనుసరించాల్సిన నియమాలను వివరించారు. ఎన్‌డిపిఎస్ చట్టంలోని నేరాలు, వాటికి సంబంధించిన శిక్షలను తెలియజేశారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా చేపడుతున్న ఆపరేషన్ సేఫ్ క్యాంపస్, ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ ఈగల్ కార్యక్రమాల లక్ష్యాలను విద్యార్థులకు వివరించారు. ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972ను విద్యార్థులు పలకరించగా, డ్రగ్స్ వద్దు బ్రో నినాదాన్ని తెగువగా ప్రతిధ్వనింపజేశారు. చివరగా విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

విద్యార్థులకు కరాటే శిక్షణపై సానుకూల స్పందన

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లిలో విద్యార్థుల ఆత్మరక్షణపై కరాటే శిక్షణ నెలరోజుల పాటు నిర్వహించడంపై పాండు కరాటే అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బాకూరు పాండురాజు సోమవారం ఎఎస్‌పి నావజ్యోతి మీశ్రాను మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు, ముఖ్యంగా యువతీయువకుల ఆత్మరక్షణ దృష్ట్యా సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ, మోటివేషన్ క్లాస్‌లు అత్యంత అవసరమని పాండురాజు వివరించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇటువంటి శిక్షణలు నెలరోజులపాటు నిర్వహించేందుకు అకాడమీ తరపున సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనపై ఏఎస్పీ నావజ్యోతి మిశ్రా సానుకూలంగా స్పందించారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో కీలకంగా మారుతాయని అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ హైస్కూల్ ఏర్పాటు చేయాలని వినతి

ఎంఇఒకి వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి- ఎటపాక: ఎటపాక మండల కేంద్రంలో ప్రభుత్వ హైస్కూల్ ఏర్పాటు చేయాలనీ ఎంఇఒ లక్ష్మీనారాయణకి స్థానికులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విజన తర్వాత, ఎపిలో కలిసిన, ఎటపాకను మండల కేంద్రంగా ఏర్పాటు చేసిన తర్వాత, ఉమ్మడి రాష్ట్రంలో సిఎస్ఐ వారు ఎటపాకలో నిర్వహించిన పాఠశాలను మధ్యంతరంగా నిలిపేయడం వల్ల ఈ ప్రాంత విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఎటపాకకు ఆనుకుని ఉన్న భద్రాచలం వెళ్లాలంటే స్థానికత సమస్య వల్ల వెళ్లలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలను ఏర్పాట చేయాలని కోరుతున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఇఒ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఐటిడిఎ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆదివాసీలు

ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో గ్రామసభలను రద్దు చేయాలి

ప్రజాశక్తి- రంపచోడవరం : రంపచోడవరం కేంద్రంగా నేషనల్ పార్క్, ఎకోసెన్సిటివ్ జోన్ పేరుతో నిర్వహిస్తున్న గ్రామ సభలను రద్దు చేయాలని ఎఐకెఎంఎస్ డిమాండ్ చేసింది. సంఘం ఆధ్వర్యంలో ఎకోసెన్సిటివ్ జోన్‌ల పేరుతో గ్రామ సభలు రద్దు చేయాలని ఐటిడిఎ ఎదుట తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటి మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఈతపల్లి సిరిమల్లి రెడ్డి మాట్లాడుతూ ఆదివాసీ హక్కులు, చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాదల విద్యాసాగర్‌రెడ్డి పంచాయతీ పెద్దలు కోండ్ల బొజ్జి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సమావేశం ఏర్పాటు చేసిన నాయకులు

పార్టీ బలోపేతానికి కార్యాచరణ

ప్రజాశక్తి - జికేవీధి : మండలంలోని రింతాడలో పాడేరు నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు పొత్తూరు కొండలరావు ఆధ్వర్యంలో మండలంలో 16 పంచాయతీల టిడిపి నాయకులు అందరితో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులంతా టిడిపి గెలుపుకోసం అంతా కషి చేయాలనీ. సమస్యలు ఉంటే ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి, పరపతి సంఘం చైర్మన్ నూకరాజు, ఎఎంసి డైరెక్టర్ మొట్టడం శరబన్నదొర కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోని ప్రభుత్వం

పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరావు

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి - కొయ్యూరు: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఏజెన్సీలో ఉన్న పాఠశాలలను సంక్షేమ వసతిగృహాలను పట్టించుకోవడం లేదని పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరావు విమర్శించారు. రాజేంద్రపాలెం బాలికల వసతిగృహంలో విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం విధితమే. సోమవారం కొయ్యూరులో ఆశ్రమ పాఠశాలకు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గతంలో వైసిపి ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ ఇటువంటి ఘటనలు జరగలేదన్నారు. నేటికీ గిరిజన మంత్రి స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ నెలలోనే అటు జెర్రెలలో ఇలాగే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

పరిశుభ్రత లోపించడం వల్లనే : టిడిపి నేత కిల్లు రమేష్‌నాయుడు

కొయ్యూరు ఆశ్రమ పాఠశాలను టూరిజం శాఖ డైరక్టర్ టిడిపి నేత కిల్లు రమేష్‌నాయుడు సోమవారం విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంటశాల పరిసరాల వద్ద శుభ్రత లోపించడం వల్ల జరిగి ఉండొచ్చని వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కేజీబివి బాలికల వసతిగృహానికి వెళ్లి మురుగు గుంటను పరిశీలించి కంచె నిర్మించాలని స్కూల్ ఎస్ఓని ఆదేశించారు.

వసతిగృహ విద్యార్థినులకు మాజీ ఎంపి పరామర్శ

విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న రాజేంద్రపాలెం బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులను సోమవారం అరకు మాజీ ఎంపి గొడ్డేటి మాధవి పరామర్శించారు. అదేవిధంగా మరికొంతమంది విద్యార్థినులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో ఉండడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఇటీవల ఏజెన్సీలో రోజులు, నెలల పసిపిల్లలు మృతి చెందడంపై అసహనం వ్యక్తం చేశారు. కెజిహెచ్‌లో ఎస్టి సెల్ తీరు సరిగా లేదని ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు: మాజీ జిసిసి చైర్మన్ ఎంవివి ప్రసాద్

రాజేంద్రపాలెం విద్యార్థినులను మాజీ జిసిసి చైర్మన్ ఎంవివి ప్రసాద్ సోమవారం పరామర్శించారు. ఇక నుండి ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ఉండాలని ఎటిడబ్ల్యూఒ, వార్డెన్ జ్యోతితో మాట్లాడమన్నారు.

ఏడుకొండలు దాటితేనే ఏరువాడ..

బాహ్యప్రపంచానికి దూరంగా గిరిజనగ్రామం
కనీస వసతులూ కరువు
పట్టించుకోని పాలకులు

రేషన్ తెచ్చుకుంటున్న గ్రామస్తుడు

ప్రజాశక్తి- మోతుగూడెం: చింతూరు మండలంలోని తులసిపాక సమీపంలో ఉన్న ఏరువాడ కొండారెడ్డి గ్రామం. ఈ గ్రామంలో సుమారు 30 గిరిజన కుటుంబాల వారు నివసిస్తున్నారు. వీరికి ఇప్పటికీ కనీస మౌలిక వసతులు కూడా లేవు. దట్టమైన అరణ్యంలో ఉండడం కూడా దీనికి ఒక కారణం. ఏ రకమైన సౌకర్యం కల్పిద్దామన్నా ఏడు కొండలు ఎక్కితే గాని ఆ గ్రామానికి చేరుకోలేం. వెళ్లేలోగా ఏ అడవిజంతువు బారినపడితే అంతేసంగతి. అయినా వారు అదే గ్రామంలో ఏళ్ల తరబడి జీవనం సాగిస్తున్నారు. ఈ గ్రామస్తులు ప్రధానంగా కూరగాయలు సాగు చేస్తూ వాటిని సమీపంలోని సంతల్లో విక్రయిస్తూ, అదేవిధంగా అటవీ ఉత్పత్తులైన కుంకుడుకాయలు, విప్పపువ్వు, తేనె, కొండచీపుర్లు వంటి వాటిని సేకరించి జిసిసి స్టోర్‌కు విక్రయిస్తుంటారు. దానిద్వారా వచ్చిన ఆదాయమే వారికి ఉపాధి మార్గం. రేషన్ తీసుకోవాలన్నా సరే ఏడు కొండలు దిగి తులసిపాక డిపోకు రావాల్సిందే. ఎవరికైనా ఆరోగ్య పరిస్థితి బాగోకపోతే ఇక నరకమే. రోగితో సహా కింద ఉన్న తులసిపాకకు రావాల్సిందే. సుమారు 15 కిలోమీటర్లు రాళ్లు, రప్పలు దాటుకుని వెళ్లాలి. వాగుకూడా దాటాల్సి వస్తుంటుంది. సోకిలేరు వాగు ప్రమాదకరంగా ప్రవహిస్తుంటుంది. అయినా దాన్ని దాటుకుని వెళ్లాల్సిందే. ఒక్కోసారి వాగులో గల్లంతై మృతి చెందిన వారు కూడా ఉన్నారు.

జిపిఎస్ పాఠశాల ఏర్పాటు

ఏరువాడలో గతంలో ఐటీడీఏ అధికారులు ఒక జిపిఎస్ పాఠశాలను

ఏరువాడ గ్రామం

ఏర్పాటు చేసి ఆ గ్రామంలోని పిల్లలకు చదువులను నేర్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 11 మంది పిల్లల మాత్రమే ఉన్నారు. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులకు కూడా కనీస సౌకర్యాలు ఉండవు. అదే గ్రామంలోనే ఉంటూ వారికి విద్యాబుద్ధులు నేర్పించడం విశేషం. రాత్రయితే చిమ్మ చీకటిలోనే గ్రామస్తులు గడుపుతుంటారు. సోలార్ లైట్లు ఏర్పాటు చేసినా అవి తాత్కాలికంగానే పనిచేస్తున్నాయి.
ఇప్పటికైనా చింతూరు ఐటిడిఎ అధికారులు గాని అల్లూరి సీతారామరాజు జిల్లా అధికారులు గాని స్పందించి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని లేదా ఆ గ్రామాన్ని ఇతర ప్రాంతానికి తరలించి అక్కడ వారికి పురావాసం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

సోకిలేరు వాగు..

జనసేన పార్టీలోకి చేరిన కార్యకర్తలు

జనసేనలోకి చేరికలు

ప్రజాశక్తి -సీలేరు: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నాదెండ్ల రాష్ట్రాభివృద్ధి కోసం చేస్తున్న కృషికి ఆకర్షితులై పలువురు జనసేన పార్టీలోకి చేరుతున్నట్టు పార్టీ అరుకు పార్లమెంటు ఇన్‌చార్జి గంగులయ్య వెల్లడించారు. ధారకొండలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు, దుప్పిలివాడ, ధారకొండ, గుమ్మరేవులు పంచాయతీల నుంచి సుమారు 250 మంది జనసేన పార్టీలో సోమవారం చేరారని తెలిపారు. ఇంతమంది పార్టీలోకి రావడానికి కృషి చేసిన సీలేరు ఇన్‌చార్జి జే బాలకృష్ణ, దారకొండ పంచాయతీ దాసు గుమ్మరేవుల పంచాయతీ దారమల్లేశ్వరరావు లను గంగులయ్య అభినందించారు. జనసేన అరకు పార్లమెంట్ మెంబర్ గొర్ల వీర వెంకట్, జీకే వీధి మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎయులో బ్యాక్‌లాగ్ పోస్టులపై విచారణ జరపాలి

- డాక్టర్ బూసి వెంకటరావు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రా యూనివర్సిటీలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో పలు అక్రమాలు జరిగాయని ఈ నియామకాలపై వెంటనే న్యాయవిచారణ చేపట్టాలని దళిత సంఘాల ఐక్యవేదిక (విదసం) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆంధ్రా యూనివర్సిటీలో 2018 నుండి భర్తీ కాకుండా 33 ఎస్సి, ఎస్టి క్లాస్ 4 ఉద్యోగాల నియామకాలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై 2021లో నోటిఫికేషన్ జారీ చేశారని, ఆ సమయంలో 30 పోస్టులకు వేల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న వైస్‌ఛాన్సలర్, పాతనోటిఫికేషన్‌పై కార్యాచరణ చేపట్టి, కొత్త నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. ఏడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను బ్యాక్‌డోర్‌లో విక్రయించారని ఆరోపించారు. ఈ పోస్టుల భర్తీ ప్రక్రియపై సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ చేయాలన్నారు. కార్యక్రమంలో బూల భాస్కరరావు, గుడివాడ ప్రసాద్, డి.నిర్మల, గోరా గోపి, సిహెచ్‌దాలయ్య, సింహాచలం, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

22న యూత్ హాస్టల్స్ అంతర్రాష్ట్ర మోటార్ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం జిల్లా శాఖ స్వర్ణోత్సవాల సందర్భంగా అంతర్ రాష్ట్ర మోటార్‌సైకిల్ యాత్రను ప్రకటించింది. ఈనెల 22, 23 తేదీల్లో ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల్లో మోటర్ సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు, 22న ఉదయం 6 గంటలకు కంబాలకొండ వద్ద యాత్ర మొదలవుతుందని యూత్ హాస్టల్స్ విశాఖ జిల్లా శాఖ చైర్మన్ మహమ్మద్ మజహార్ ఇబ్రహీం మీడియాకు తెలిపారు. శ్రీకాకుళంలోని శ్రీముఖలింగం, గొట్టా బ్యారేజ్ సందర్శించి యాత్ర మధ్యాహ్నానికి పాతపట్నం చేరుకుంటుందని, భోజనం అనంతరం సాయంత్రానికి ఒడిశాలోని చంద్రగిరి వెళుతుందన్నారు. చంద్రగిరిలోని శాంబవ మహావీర టిబెటన్ మొనాస్టరీ (జిరంగా) సహా కసదా వాటర్ ఫాల్ సందర్శిస్తుందని, రాత్రికి అక్కడే బస చేసి 23న ఒడిశా లోని గండహతి వాటర్‌ఫాల్ సందర్శించి, ఆంధ్ర ఒడిశా సరిహద్దులోని మహేంద్రగిరి ట్రెక్కింగ్ చేస్తుందన్నారు. ట్రెక్కింగ్ అనంతరం బృందం తిరిగి ప్రయాణం అవుతుందన్నారు. పాల్గొనగోరే ఉత్సాహంతులు 20వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు, కార్యదర్శి షేక్‌సైదా (8328192471) కోశాధికారి ఎస్.ఎం.కె. అనిల్‌కుమార్ (9856209999) ఉపాధ్యక్షులు సాజహాన్‌ఖాదర్ (7799377734), కార్యవర్గ సభ్యులు ఎన్. చిన్నారావు (9248331741)ను సంప్రదించవచ్చునని తెలిపారు.